క్లుప్తంగా

వధూవరులకు మంత్రి సురేష్ ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి సురేష్

పుల్లలచెరువు: పుల్లలచెరువులో శుక్రవారం రాత్రి 11 గంటలకు జరిగిన ఒక వివాహ కార్యక్రమానికి మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బూచేపల్లి వెంకటేశ్వర్లు కుమార్తె వివాహానికి మంత్రి సురేష్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచెపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి, కోటిరెడ్డి, ఎంపీటీసీ రాములు, రైతు సంఘ నాయకులు జానకి రఘు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

అచ్చిరెడ్డి కుటుంబానికి మంత్రి సురేష్ పరామర్శ



అచ్చిరెడ్డికి నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

పుల్లలచెరువు: మండలంలోని బిర్నేనేనిపల్లి వైఎస్సార్ సీపీ నాయకుడు బొద్దు అచ్చిరెడ్డి దినదిశ కర్మకు మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హాజరయ్యారు. తొలుత అచ్చిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అచ్చిరెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. మంత్రి వెంట ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వెంకటయ్య, సర్పంచ్ దీనయ్య, నాయకులు సాంబయ్య, కృష్ణారావు ఉన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

దర్శి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ కుసుమ కుమారి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున సమావేశం వాయిదా వేసినట్లు ఆమె స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత సమావేశం ఎప్పుడు నిర్వహించేది నిర్ణయిస్తామని పేర్కొన్నారు.

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం: పట్టణంలో కొంతమంది ఇళ్ల వద్దకు వచ్చి విద్యుత్ శాఖ పేరుతో ఐరన్ బోర్డులు బిగించి 50 రూపాయలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, విద్యుత్ శాఖ తరఫున అలాంటిది ప్రస్తుతం లేదని డీఈ షియానాయక్ తెలిపారు. వినియోగదారులు ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన పనిలేదని స్పష్టం చేశారు.

మండల పరిషత్ సమావేశం నేడు

ముండ్లమూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ సుంకర సునీత అధ్యక్షతన ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.కుసుమకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో జరుగుతుందన్నారు. సమావేశానికి మండల స్థాయి అన్ని శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని కోరారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని సూచించారు.

రిటైర్డ్ పీడీ నారాయణరెడ్డి మృతి

త్రిపురాంతకం: వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఎంతో మంది క్రీడాకారులను అందించిన రిటైర్డ్ పీడీ టి.నారాయణరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. త్రిపురాంతకానికి చెందిన నారాయణరెడ్డి జిల్లాలో అనేక పాఠశాలల్లో పీడీగా పనిచేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంతో మంది క్రీడాకారులను ఆయన తీర్చిదిద్దారు. ఆయన మృతికి పలువురు ఉపాధ్యాయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

లోక్ అదాలత్‌లో 1102 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జీఎల్‌వీ ప్రసాద్

మార్కాపురం: లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం లభిస్తుందని మార్కాపురం జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి రాజా వెంకటాద్రి అన్నారు. శనివారం మార్కాపురం జిల్లా ఆరో అదనపు న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. మొత్తం 1102 కేసులు పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. ఇందులో 13 సివిల్ కేసుల ద్వారా రూ.6 లక్షల 60 వేల పరిహారాన్ని, 2 మోటార్ యాక్సిడెంట్ కేసుల్లో రూ.2 లక్షల 60 వేలు, 9 ఈపీ కేసుల్లో రూ.29 లక్షల 73 వేల 798 పరిహారంగా ఇప్పించినట్లు తెలిపారు. 3 ఫ్యామిలీ కేసులు, 115 క్రిమినల్ కేసులు, అట్రాసిటీ కేసులు 927, 5 చెక్ బౌన్స్ కేసుల్లో రూ.8 లక్షల పరిహారం ఇప్పించినట్లు వివరింఆచరు. 3 భరణం కేసులు, ఒక గృహహింస కేసుతో పాటు పలు కేసులను పరిష్కరించినట్లు ఆయన వివరించారు. లోక్ అదాలత్‌లో ఆరో అదనపు జిల్లా జడ్జి టి.రాజావెంకటాద్రి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.రమేష్‌నాయుడు, జూనియర్ సివిల్ జడ్జి వి.ఆదినారాయణ, ప్రిసైడింగ్ ఆఫీసర్‌లుగా వ్యవహరించారు. సీనియర్ న్యాయవాదులు షేక్ యూసఫ్ అలీ, పి.రామచంద్ర, ఉషశ్రీ, మొఘల్ అన్వర్‌బేగ్, మహబూబ్ అలీ, కడియం రామయ్యలు బెంచి మెంబర్లుగా వ్యవహరించినట్లు రాజావెంకటాద్రి వివరించారు.

పొదిలిలో..

పొదిలి రూరల్: ప్రస్తుత సమాజంలో ప్రశాంతమైన జీవితం గడపాలంటే రాజీ మార్గమే రాజ మార్గమని పొదిలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్ భార్గవి అన్నారు. శనివారం పొదిలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహించారు. ఈరోజు మొత్తం 457 కేసులు పరిష్కారమయ్యాయి. వాటిలో సివిల్ కేసులు 3, క్రిమినల్ కేసులు 2, ఎస్‌టీసీ కేసులు 367 ఉన్నాయి.

దర్శిలో..

దర్శి: పలు కేసుల్లో కక్షలు, కార్పణ్యాలకు వెళ్లి కోర్టు చుట్టూ తిరగటం కన్నా రాజీ చేసుకుంటే ఇద్దరూ గెలిచినట్లేనని సీనియర్ సివిల్ జడ్జి జీఎల్‌వీ ప్రసాద్ సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో నేషనల్ లోకల్ అదాలత్ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా కోర్టులో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి సరస్వతి, సంఘ సేవకుడు జీవీ రత్నం, న్యాయవాదులు చెన్నకేశవులు, మనోహరమ్మ, ఆదినారాయణ పాల్గొన్నారు.

మార్కాపురం: మార్కాపురం జిల్లా ఆరో అదనపు న్యాయస్థానంలో న్యాయమూర్తుల చొరవతో కొంతకాలంగా మనస్పర్థలతో విడివిడిగా ఉంటున్న మూడు జంటలు తిరిగి ఒక్కటయ్యాయి. చిన్నచిన్న కారణాలతో పోలీసుస్టేషన్‌లలో కేసులు పెట్టుకున్నవారు శనివారం విచారణ సందర్భంగా కోర్టుకు వచ్చారు. జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి రాజా వెంకటాద్రి, సీనియర్ సివిల్ జడ్జి రమేష్ నాయుడు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఆదినారాయణ తదితరులు దంపతులను కూర్చోబెట్టి కౌన్సిలింగ్ ఇచ్చారు. చిన్నచిన్న తగాదాలతో కోర్టుల చుట్టూ తిరిగితే సామాజికంగా, ఆర్థికంగా ఏ విధంగా నష్టపోతున్నారో వివరిస్తూ కలిసి ఉంటే పిల్లాపాపలతో ఏ విధంగా సంతోషంగా ఉండొచ్చో వివరించారు. ఇలా ఏడాది వ్యవధిలో 18 జంటలను కలిపినట్లు న్యాయమూర్తులు వివరించారు. భార్యాభర్తలు కలిసి ఉండాలని సూచించారు. ఒక్కటైన మూడు జంటలను జడ్జిలు రాజావెంకటాద్రి, రమేష్ నాయుడు, ఆదినారాయణ, మార్కాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ నారాయణ, బి.కాశయ్యలు అభినందించి సన్మానించారు.

గిద్దలూరులో..

గిద్దలూరు రూరల్: కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాదానమ్మ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా న్యాయవిజ్ఞాన సదస్సు కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా సివిల్ కేసులు 7, క్రిమినల్ కేసులు 86 భరణం కేసులు 5, గృహ హింస కేసులు 2, పెట్టి కేసులు 962, బ్యాంక్ ప్రీ లిటిగేషన్ కేసులు 1145, మొత్తం కేసులకు 990 నగదు లావాదేవీలు జరిగాయి. కార్యక్రమంలో న్యాయవాదులు సిద్దయ్య, పిచ్చయ్య, పారా లీగల్ వాలంటరీ మధు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సజ్జలను కలిసిన ఆరోగ్యమిత్రల నాయకులు



సజ్జలకు వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర నాయకులు

పెద్దదోర్నాల: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని దళిత, గిరిజన ఆరోగ్యమిత్రల సంఘ రాష్ట్ర నాయకులు శనివారం కలిశారు. అమరావతిలోని ఆయన కార్యాలయంలో కలిసిన నాయకులు తమ సమస్యలను సజ్జలకు వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన పేదల సంజీవని ఆరోగ్యశ్రీ పథకంలో తాము 16 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కరోనా సమయంలోనూ తాము ధైర్యంగా రోగులకు వైద్య సేవలు అందించామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సజ్జల ఆరోగ్య మిత్రల పట్ల ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని, క్యాడర్-1, క్యాడర్-2 ఇచ్చే విషయంలో లీగల్‌గా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆరోగ్యమిత్రలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్యమిత్ర దళిత, గిరిజన యూనియన్ అధ్యక్షుడు మాచర్ల బుజ్జి, కాకాని అప్పారావు, దర్శనం రాంబాబు, కిరణ్ కుమార్ ఉన్నారు.

పొగాకు దొంగలను పట్టుకోవాలి

కురిచేడు: బర్లీ పొగాకు పందిర్ల నుంచి రాత్రి వేళల్లో దొంగతనాలు జరుగుతున్నాయని, ఆటోల్లో పొగాకును తరలిస్తున్నారని, వారిని అరెస్టు చేసి తమను ఆదుకోవాలని రైతులు ఎస్ఐ దేవకుమార్‌కు విజ్ఞప్తి చేశారు. కొన్ని రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతున్నాయని, పొగాకుకు డిమాండ్ ఉండటంతో దొంగతనాలు అధికమయ్యాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శ్మశానానికి దారేది?



చిల్లచెట్లతో మూసుకుపోయిన శ్మశానం దారి ఇదే..

ముండ్లమూరు: మండలంలోని శింగనపాలెం ఎస్సీ కాలనీకి కేటాయించిన శ్మశానానికి దారిలేక కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. గతంలో పలు పర్యాయాలు రెవెన్యూ అధికారులకు దారి సమస్య చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. సర్వే నంబర్ 44లో కొంత స్థలాన్ని శ్మశాన స్థలంగా కేటాయించారు. గత ప్రభుత్వ హయాంలో శ్మశాన నిర్మాణానికి నిధులు కేటాయించి అరకొర పనులు చేపట్టి వదిలేశారు. ఇప్పుడు దారి పూర్తిగా చిల్ల చెట్లతో మూసుకు పోవడంతో అటుగా వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. శ్మశానం ఆనుకొని ఉన్న పొలాల్లో దారి లేకుండా చేసి సాగు చేసుకున్నారు. శనివారం కాలనీలో అచ్చుకట్ల రాహేలమ్మ అనారోగ్యంతో మృతి చెందగా శ్మశానానికి దారి సమస్య ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానానికి దారి సమస్యకు పరిష్కారం చూపాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పబ్లిక్ లీగల్ నోటీసు

నా క్లయింటు అయిన షేక్ ముబారక్ అల్తాఫ్ అర్ రెహమాన్, S/o ఎస్.ఎమ్. హుస్సేన్, బెంగుళూరు - 560 002 గారి వలన ఇన్‌స్ట్రక్షన్స్ పొంది ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయు పబ్లిక్ లీగల్ నోటీసు ఏమనగా, క్రింది షెడ్యూలు దాఖలా భూమి నా క్లయింటు యొక్క సంపూర్ణ హక్కుభుక్త స్వాధీన అనుభవములో ఉన్నది. సదరు భూమి నా క్లయింటు యొక్క నిర్వివాదమైన భూమి అయి ఉన్నది. సదరు షెడ్యూలు భూమికి నా క్లయింటు టైటిల్ హోల్డరు అయి ఉన్నారు. నకిలీ పత్రములను సృష్టించి సదరు షెడ్యూలు భూమికి సంబంధించి కొందరు దురాక్రమణదారులు, మోసము చేసి దగాకోరులు కుట్రపూరితమైన వారు ఫోర్జరీ డాక్యుమెంటును సృష్టించి బ్యాంకులలో ఋణాలు పొందుటకు, అమ్ముటకు, లీజుకు ఇచ్చుటకు ప్రయత్నించుచున్నారని నా క్లయింటు దృష్టికి వచ్చినది. సదరు షెడ్యూలు దాఖలా భూమిపై ఇంకెవ్వరికినీ ఎటువంటి హక్కులు లేవు. సదరు షెడ్యూలు భూమికి సంబంధించి నా క్లయింటు తప్ప వేరే వారితో ఎటువంటి వ్యవహారములు జరిపిననూ అవి నా క్లయింటును బద్ధుడిని చేయజాలవు అని గ్రహించేది. సదరు అలాంటి వ్యక్తులపై నా క్లయింటు న్యాయపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకొనునని ఇందుమూలముగా ఖండితముగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు: ఆంధ్రప్రదేశ్ స్టేట్, ప్రకాశం డిస్ట్రిక్ట్, మార్కాపూర్ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, మార్కాపూర్ సబ్ డిస్ట్రిక్ట్, ఇన్ మార్కాపూర్ టౌన్ మునిసిపల్ లిమిట్స్, సర్వే నెం.234/1లో, ప్రస్తుతము సర్వే నెం.234/1బి-2బి, ఎ.10-76 సెంట్లు పైకి ఒక ఎకరా విస్తీర్ణము గల భూమి. సదరు ఒక ఎకరా భూమికి హద్దులు: తూర్పు: వెన్నా చిన్న అబ్బాయిగారి భూమి, దక్షిణం: గుంటక పిచ్చిరెడ్డిగారి భూమి, పడమర: గొలమారి బాల కాశయ్య గారి భూమి, ఉత్తరం: గొలమారి బాల కాశయ్యగారి భూమి.

సదరు హద్దులలో గల ఒక ఎకరా విస్తీర్ణము గల భూమి.

ఇట్లు

షేక్ యూసుఫ్ అలి, B.Com, L.L.B

అడ్వకేటు, 10వవార్డు, మస్జిదు ప్రక్కన మార్కాపురం. సెల్: 9440565787

సీఎం వైఎస్ జగన్ మేలు మరువలేం..

- చాత్తాద శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కుమార్



మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కుమార్

త్రిపురాంతకం: ఎన్ని ప్రభుత్వాలు మారినా చాత్తాద శ్రీవైష్ణవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి చేయూత ఇస్తున్నారని, ఆయన మేలు మరువ లేమని ఆ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. త్రిపురాంతకంలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటికీ తమ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యం లభించలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతిగా పనిచేస్తున్నారని కొనియాడారు. సామాజికంగా తమ ఎదుగదలకు ఆయన ప్రోత్సాహాన్ని అందించారన్నారు. గౌరవ స్థానం కల్పించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంఘ సభ్యులంతా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. త్రిపురాంతకంలో సత్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు నరహరి మాట్లాడుతూ పక్కా గృహాలు లేని వారి వివరాలు అందిస్తే వాటి మంజూరుకు కార్పొరేషన్ నుంచి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో పలువురు సంఘ ప్రముఖులు పాల్గొని సందేశం అందించారు.

నూతన కార్యవర్గం

యర్రగొండపాలెం నియోజకవర్గం అధ్యక్షుడిగా నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా జైన్, మహిళా కార్యదర్శులుగా రంగమ్మ, లక్ష్మి, కోశాధికారిగా తిరువెంగళయ్య, పాలక మండలి సభ్యులను ఎన్నుకున్నారు.

మంత్రి సొంత నిధులతో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ బీసీ హాస్టల్‌ను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సందర్శించారు. ఆయన దృష్టికి విద్యార్థులు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు మరమ్మతులకు గురయ్యాయని తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సొంత నిధులతో హాస్టల్లో నాలుగు ఫ్యాన్లు, 10 ట్యూబ్‌లైట్లు కొత్తవి శనివారం ఏర్పాటు చేశారు. విద్యార్థులు, గ్రామస్తులు మంత్రికి అభినందనలు తెలిపారు.

సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా చినమనగుండం ఎంపీటీసీ సభ్యుడు, నాగంపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కోంద్రు వెంకటేశ్వర్లును నియమించారు. ఆ మేరకు మార్కాపురం నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ వాసుదేవరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు కన్వీనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, పార్టీ మండల నాయకులకు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా తాళ్లూరు మండల కన్వీనర్లుగా బొజ్జా సజీవ్‌కుమార్, ఇడమకంటి భరత్‌రెడ్డిలు నియమితులయ్యారు. కో కన్వీనర్లుగా బొజ్జా లాజర్, కాంచన గుంట మణికంఠ, విప్పర్ల శ్రీకాంత్, కావూరి ఇస్మానియేల్, గంగవరపు శివారెడ్డిలు నియమితులయ్యారు. తమకు బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి, ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్‌కు, మండల పార్టీ ఇన్‌చార్జి మద్దిశెట్టి రవీంద్రకు కన్వీనర్లు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దారవీడు: యర్రగొండపాలెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా మండలంలో సానికవరం గ్రామానికి చెందిన ఒద్దుల లక్ష్మీరెడ్డిని నియమించారు. తనకు కన్వీనర్ పదవి వచ్చేందుకు సహకరించిన మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు ఎంతో రుణపడి ఉంటానని లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. ఆయనకు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

చెన్నకేశవునికి శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించింది. ఉదయం 11.10 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలు ప్రతిష్టించారు. వేదమంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కల్యాణానికి ఉభయదాతలు హాజరయ్యారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి.కేశవరావు, ధర్మకర్తలు, గౌరవాధ్యక్షుడు రామడుగు కోటేశ్వరరావు, కోశాధికారి పెరుమాళ్ల కోటేశ్వరరావు, కార్యదర్శి రామడుగు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

కమనీయం..రంగనాయకుని కల్యాణం

రాచర్ల: రంగనాయక.. పాహిమాం.. అంటూ భక్తజనం పులకించిపోయారు. మండలంలోని జేపీ చెరువు గ్రామానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్లమల అడవుల్లో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ నెమలిగుండ్ల రంగనాయక స్వామి కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నెమలిగుండ్ల రంగనాయకస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల కల్యాణంలో భక్తులు పాల్గొని పరవశించారు. ఆలయ చైర్మన్ కన్నసాని ఓబులేసు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి పాటు ఆరుగురు ఉభయదాతలు పట్టువస్త్రాలతో దేవస్థానం అర్చకులైన అన్నవరం పాండురంగాచార్యులు, సత్యనారాయణచార్యులు బృందం కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

జీవన ఎరువులు ఉపయోగించుకోవాలి

తాళ్లూరు: మిరపలో తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టి మంచి దిగుబడులు పొందాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. కొత్రపాటివారిపాలెంలో సాగు చేసిన మిరప పంటను ఆయన శనివారం పరిశీలించారు. మిరపలో తామర పురుగు నియంత్రకు సూడోమోనాస్ 20 గ్రాములు లీటరు నీటికి జిగురుతో కలిపి పిచికారి చేయాలని, 5 శాతం వేప గింజల కషాయాన్ని, సర్ఫ్ పౌడర్ లేదా, కుంకుడు రసంతో కలిపి పిచికారీ చేయాలని కోరారు. జీవన ఎరువులు తక్కువ ఖర్చుతో సస్యరక్షణకు ఉపయోగపడతాయని చెప్పారు.

నాటుసారా తయారీ బెల్లం ఊట ధ్వంసం

గిద్దలూరు రూరల్: మండలంలోని ఓబులాపురం తండా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో స్థానిక సీఐ ఫిరోజ్, ఎస్‌ఈబీ సీఐ అరుణకుమారిల ఆధ్వర్యంలో సిబ్బంది వెయ్యి లీటర్ల నాటుసారా తయారీ కోసం నిల్వ ఉంచిన బెల్లం ఊటను శనివారం ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో పోలీసులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

పొదిలి రూరల్: సమాజంలో ప్రతి ఒక్కరూ కాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని మెడికల్ అంకలాజిస్ట్ డాక్టర్ సాయికృష్ణ అన్నారు. శనివారం పొదిలి పెన్షనర్ల భవనంలో హెచ్‌సీజీఎంఎస్‌ఆర్ అధ్వర్యంలో క్యాన్సర్‌పై ప్రైజలకు అవగహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ అంటే మరణం అనే భావన ప్రతి ఒక్కరిలో ఉండిపోయిందన్నారు. ఇప్పుడు క్యాన్సర్ చికిత్స చాలా మెరురగుపడిందని పేర్కొన్నారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే కోలుకోవడం సాధ్యపడుతుందన్నారు. రూపస్‌కుమార్, బాదుల్లా, మదార్‌వలి పాల్గొన్నారు.